# కళాశాల విద్యార్థులకూ 'అపార్ ఐడీ'

- జూన్ నాటికి ప్రక్రియ పూర్తిచేయాలి
- వర్సిటీలకు రాష్ట్ర విద్యాశాఖ ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: దేశవ్యాప్తంగా ఉన్నత విద్య అభ్యసించే విద్యార్థులందరికీ 'అపార్ ఐడీ' అందించాలని ఇటీవల కేంద్ర విద్యాశాఖ నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో రాష్ట్ర విద్యాశాఖ ఆ దిశగా చర్యలు చేపట్టింది. వచ్చే జూన్ నాటికి ఈ ప్రక్రియ పూర్తిచేయాలని తాజాగా అన్ని వర్సిటీలు, కళాశాలల యాజమాన్యాలను ఆదేశాలు జారీ చేసింది. దేశవ్యాప్తంగా ఉన్న పాఠశాల విద్యార్థులందరికీ 'వన్ నేషన్-వన్ స్టూడెంట్' పేరిట 12 అంకెల ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ(అపార్) గుర్తింపు సంఖ్య ఇవ్వాలని కేంద్ర విద్యాశాఖ రెండేళ్ల క్రితమే నిర్ణయించింది. అపార్ ఐడీ ఇవ్వాలంటే..సదరు విద్యార్థి ఆధార్ సంఖ్య నమోదుచేయడం తప్పనిసరి. ఆధార్ వివరాలు సేకరించేందుకు ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి సమ్మతి పత్రం తీసుకోవాలి. తల్లిదండ్రులు ఆధార్ వివరాలు ఇచ్చేందుకు సమ్మతించకపోవడం వంటి ప్రతిబంధకాల నేపథ్యంలో రాష్ట్రంలో అపార్ ఐడీ జారీ ప్రక్రియ మందకొడిగా నడుస్తోంది.

### 12 వర్సిటీల వీసీలతో కాన్ఫరెన్స్

ఈమేరకు బుధవారం రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, కేంద్ర విద్యాశాఖ అధికారులు.. రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య బాలకిష్టారెడ్డి, కార్యదర్శి ఆచార్య శ్రీరాం వెంకటేష్, రాష్ట్ర విద్యాశాఖ పరిధిలోని 12 వర్సిటీల ఉపకులపతులు, రిజిస్ట్రార్లతో ఆన్‌లైన్ సమావేశం నిర్వహించారు. 'అపార్ ఐడీ తీసుకున్న విద్యార్థి ఇంజినీరింగ్ వంటి ఉన్నత విద్యలో తాము పొందిన క్రెడిట్లను అకడమిక్ బ్యాంకు ఆఫ్ క్రెడిట్స్‌లో దాచుకోవచ్చు. ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి, ఒక వర్సిటీ నుంచి మరో వర్సిటీకి మారినా క్రెడిట్లను బదిలీ చేసుకోవచ్చు. ఇలాంటి ప్రయోజనాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి. వచ్చే జూన్ నాటికి ప్రతి విద్యార్థికీ అపార్ ఐడీ ఇచ్చే దిశగా చర్యలు వేగవంతం చేయాలి' అని ఆదేశాలు ఇచ్చారు.

# నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఐటీ పార్క్ ప్రారంభం



నవతెలంగాణ-మేడ్చల్

మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం సైబర్ స్పేస్‌ను భద్రపరచడం-డిజిటల్ ప్రపంచానికి ఒక సవాలు పై ఒక రోజు సెమినార్‌కు తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఛైర్మన్, జేఎన్‌టీయూహెచ్ ఇన్‌చార్జి వీసీ ప్రొ. వి. బాలకిష్ట రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి నూతనంగా నిర్మించిన ఐటీ పార్క్‌ను ప్రారంభించారు. వింగ్ కమాండర్ గరిగిపాటి శ్రీనివాసు, మహీంద్రా విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్, బంగారు లక్ష్మీ గౌరవ అతిథులుగా విచ్చేసి సైబర్ సెక్యూరిటీ సెమినార్‌ను ప్రారంభించి మాట్లాడారు. సైబర్ దాడులను ప్రతి ఒక్కరూ సమర్థవంతంగా ఎదుర్కోవాలని అందుకు తగ్గ కనీస అవగాహన మనకు ఉండాలని, మనకు ఉన్న జ్ఞానాన్ని ఇతరులకు పంచాలని తద్వారా సైబర్ దాడులను ఎదురుకోగలమని తెలిపారు. అనంతరం కళాశాల సీడీసీ డీన్ లావణ్య కెరీర్ అభివృద్ధి కేంద్రం ఆవశ్యకత ను అందు వల్ల విద్యార్థుల్లో ప్రతిభ ను వెలికి తీసేలా ఈ కేంద్రం మరింత ఉపయోగపడుతుందని తెలిపారు ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ సాధారణ ప్రజలు వాడే వినియోగ పరికరాలు చరవాణులు, కంప్యూటర్లు, లాప్‌టాప్‌లు, స్మార్ట్ గడియారాలు సైబర్ నేరగాళ్ల లక్ష్యాలు అవుతాయన్నారు. అనంతరం బంగారు లక్ష్మీ మాట్లాడుతూ సైబర్ సెక్యూరిటీ అనేది హ్యాకర్‌లు, స్కామర్‌లు సైబర్ నేరగాళ్ల హానికరమైన దాడుల నుండి ఇంటర్నెట్-కనెక్ట్ చేయబడిన పరికరాలు సేవలను రక్షించే రక్షణ అన్నారు.కళాశాల కార్యదర్శి జె. త్రిశూల్ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి గొప్ప కార్యక్రమాలు తమ కళాశాలలో జరగడం చాలా ఆనందకరమని, ఈ కార్యక్రమాలన్ని విద్యార్థులకు మేలు చేసేవే అని, తద్వారా వారు ప్రాంగణ నియామకాల్లో మరింత రాణించగలరాని తెలిపారు. కళాశాల డైరెక్టర్ డా. ఎ మోహన్ మాట్లాడుతూ ఇలాంటి సెమినర్ల వల్ల ఉపాధ్యాయులు తమ ప్రతిభను మరింత మెరుగుపర్చుకోగలరని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. ఆర్ లోకనాథం మాట్లాడుతూ కళాశాల ప్రారంభించి 17 సంవత్సరాలు అయిందని,ఆ నాటి నుండి నేటి వరకు కళాశాల అంచెలంచెలుగా పురోగమించిందని, అనతికాలంలోనే 'న్యాక్', 'ఎంబీఏ' వంటి అక్రిడిటేషన్స్ ను పొందిందని, అలాగే తక్కువ కాలంలోనే యూజీసీ అటానమస్ స్థాయి కి కూడా చేరుకుందని తెలిపారు. అనంతరం కళాశాలలో ఆవరణలో పర్యావరణ హితంగా ఉండేందుకు మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మెన్ జె నర్సింహారెడ్డి , కార్యదర్శి జె త్రిశూల్ రెడ్డి , కోశాధికారి త్రిలోక్ రెడ్డి , సాక్ కన్వీనర్ కె పురుషోత్తం ప్రసాద్ , కార్యక్రమ సమన్వయకర్తలు డా. దిలీప్ రెడ్డి , శ్రీ లక్ష్మీ , శ్రీనివాస్ , రేవతి , సౌమ్య , , మెకానికల్ విభాగాధిపతి అశోక్ కుమార్ , ఎంబీఏ విభాగాధిపతి నాగరాజు ,సివిల్ విభాగాధిపతి వెంకటేశ్ వరప్రసాద్, గోపాల్ రెడ్డి అధ్యాపకులు పాల్గొన్నారు.

# ఓయూ అభివృద్ధికి నిధుల లేమి!

- వేతనాలు.. పింఛన్లకే నెలకు రూ.50 కోట్లు
- అధిక వేతనాలే కొత్త నియామకాలకు అడ్డంకి
- పార్ట్‌టైం అధ్యాపకులతోనే బోధన
- నోటిఫికేషన్ కోసం 6 వేల మంది అర్హుల ఎదురుచూపులు



ప్రొ.బాలకిష్టారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న స్కాలర్స్ (ఫైల్)

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ అభివృద్ధికి నిధుల లేమి అడ్డంకిగా మారింది. వర్సిటీ ఆదాయం ఉద్యోగుల వేతనాలు, పింఛన్లకే సరిపోవడం లేదు. నెలకు రూ.50 కోట్ల మేర వేతనాలు, పింఛన్లకు చెల్లించాల్సి వస్తోంది. దీంతో వర్సిటీ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన కుంటుపడ్డాయి. అధ్యాపకుల ఉద్యోగ విరమణ వయస్సు 65 ఏళ్లకు పెంపు, కొత్తగా 375 మంది గ్రూప్-4 ఉద్యోగుల రాకతో మరో రూ.50 కోట్లు అదనంగా అవసరమవుతున్నాయి. నెలకు మొత్తం రూ.100 కోట్లు వేతనాలకు పింఛన్లకు కావాల్సి ఉంటుంది. కొత్తగా పర్మనెంట్ అధ్యాపకులను నియమిస్తే వేతన చెల్లింపులు చెల్లించయ్యే అవకాశముంది. కేవలం ఒక్క వర్సిటీకే ఇంత పెద్ద మొత్తంలో వేతనాలు చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సుముఖంగా లేనట్లు తెలిసింది. వేతన భారాన్ని తట్టుకోలేక గత 15 ఏళ్లుగా ఓయూలో పార్ట్‌టైం అధ్యాపకులతోనే నెట్టుకొస్తున్నారు. మరోవైపు పరిశోధనలు కుంటుపడ్డాయి. ఓయూలో 378 మంది పర్మనెంట్ అధ్యాపకులు, వెయ్యి మంది కాంట్రాక్ట్, పార్ట్‌టైం అధ్యాపకులు ఉన్నారు. వీరికి పీహెచ్‌డీ గైడ్‌షిప్ లేనందున విద్యార్థుల సంఖ్య బాగా తగ్గింది. కోట్లాది రూపాయలు వెచ్చించినా ఆశించిన మేరకు పరిశోధనలు జరగడం లేదనే విషయం ప్రభుత్వ పరిశీలనలో తేలినట్లు సమాచారం.

### నిధుల నిలిపివేత

గతంలో సైన్స్, మెడిసిన్, ఇంజినీరింగ్, సోషల్ సైన్స్, గణిత శాస్త్రాల్లో విస్తృతమైన పరిశోధనలు జరిగేవి. కాలక్రమేణా ప్రభుత్వ వర్సిటీల్లో పరిశోధనలు తగ్గాయి. రాష్ట్ర యూనివర్సిటీలు, సెంట్రల్ యూనివర్సిటీలలో జరిగే పరిశోధనల్లో నాణ్యతా ప్రమాణాలు, కొత్తదనం లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వం నిధులను నిలిపివేసింది. కాగా, ఓయూలో పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీలు అందుకొని సుమారు ఆరు వేల మంది పర్మనెంట్ అధ్యాపక ఉద్యోగాల నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారు.

### పార్ట్‌టైం అధ్యాపకులతోనే బోధన

ప్రభుత్వ వర్సిటీల్లో పార్ట్‌టైం అధ్యాపకులతోనే బోధన కొనసాగిస్తున్నారు. నెలవారి వేతనం కాకుండా ప్రతి తరగతికి కోర్సులను బట్టి రూ.700 నుంచి రూ.వెయ్యి చొప్పున చెల్లిస్తున్నారు. దీంతో వారికి నెలకు రూ.25 నుంచి రూ. 30 వేల చొప్పున చెల్లించాల్సి వస్తోంది. భవిష్యత్తులో కేవలం ప్రైవేటు వర్సిటీలకే పరిశోధనలు పరిమితం కానున్నాయి. ప్రాథమిక విద్యపై ఎక్కువ శ్రద్ధ చూపుతున్న రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలతో గురుకుల విద్యా సంస్థలను ఏర్పాటు చేస్తోంది. డిగ్రీ, పీజీ, పరిశోధనల కోసం ప్రైవేటు విద్యాసంస్థలు, యూనివర్సిటీలను ప్రోత్సహిస్తోంది. మన రాష్ట్రంలో గత 11 ఏళ్లలో 14 ప్రైవేటు వర్సిటీలు వచ్చాయి.

ర్యాంకులను ప్రకటించనున్నారు.

# ప్రొఫెషనల్ కోర్సుల్లో 95శాతం సీట్లు మనోళ్లకే

- నాన్ లోకల్ కోటా ఇక ఖతం

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఇంజినీరింగ్, ఫార్మసీ, బీఈడీ, ఎంబీఏ, ఎంసీఏ వంటి కోర్సుల్లో లోకల్, నాన్ లోకల్ కోటాపై ప్రభుత్వం చేస్తున్న కసరత్తు కొలిక్కి వచ్చింది. 95శాతం సీట్లు తెలంగాణ విద్యార్థులకే కేటాయించాలని నిర్ణయించింది. ఇక మరో 5శాతం సీట్లను ఇతర రాష్ట్రాల్లో పనిచేస్తున్న తెలంగాణ స్థానికత గల ఉద్యోగుల పిల్లలకు కేటాయించాలన్న నిర్ణయానికి వచ్చింది. ఇదే జరిగితే నాన్ లోకల్ కోటా ఇకపై ఉండదు. ఇది వరకు ప్రొఫెషనల్ కోర్సుల్లో లోకల్, నాన్‌లోకల్ కోటా 85:15శాతంగా ఉంది. ఈ కొత్త విధానం అమల్లోకి వస్తే తెలంగాణ విద్యార్థులకు 10శాతం అదనంగా దక్కుతాయి. ఇక మరో 10 శాతం సీట్లను నేషనల్ ఇంటిగ్రేషన్ కోటాలో భర్తీచేస్తారు. ఈ సీట్లు సూపర్‌న్యూమరీ సీట్లు. వీటిని ఇప్పుడున్న సీట్ల సంఖ్యకు అదనంగా పెంచుతారు. అంటే 2025 -26 విద్యా సంవత్సరంలో అన్ని కోర్సుల్లో కన్వీనర్ కోటా సీట్లు 10శాతం పెరుగుతాయి. దీనిపై ఇప్పటికే ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకోగా, త్వరలోనే జీవో జారీకానున్నట్టు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది.